క్లుప్తంగా

చెత్త సేకరణ కేంద్రం పరిశీలన

నిండ్ర: మండలంలోని శ్రీరామపురం గ్రామ పంచాయతీలోని చెత్తసేకరణ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ, పంచాయతీల విస్తరణ అధికారి వేంకటేశులు పరిశీలించారు. మండల స్థాయిలో స్మార్ట్ విలేజ్‌గా తయారు చేయాలని పరిశీలించినట్లు చెప్పారు. ప్రతి పంచాయతీలో చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించి అభివృద్ధి చేస్తామన్నారు.

వైస్ ఎంపీపీ బాలాజికి మాతృ వియోగం



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రోజా, నాయకులు, కార్యకర్తలు

విజయపురం: వైస్ ఎంపీపీ బాలాజి తల్లి వనజమ్మ (55) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కేవీపురానికి మాజీ మంత్రి ఆర్కే రోజా వెళ్లి, ఆమె మృతదేహానికి పూల మాల వేసి, నివాళులు అర్పించారు. బాలాజి కుటుంబాన్ని పరామర్శించారు. ఆమెతో పాటు ఎంపీటీసీ, సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు.

పౌష్టికాహారం తప్పనిసరి

నిండ్ర: బాలింతలు, కిశోర బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్ వైజర్ శ్యామల అన్నారు. గురువారం మండలంలోని ఎలకాటూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం ఆవశ్యకత, పరిసరాల శుభ్రత, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దశలవారీ మామిడి కోతలతో ప్రయోజనం



కేజీ సత్రం వద్ద మామిడి రైతులకు పంట కోతలపై అవగాహన కల్పిస్తున్న సాగరిక

బంగారుపాళెం: తోటల్లో రైతులు దశలవారీగా పంట కోతలకు పూనుకుంటే అధిక ధర పొందే అవకాశం ఉందని మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక అన్నారు. మామిడి తోటల్లో కాయల కోతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం మండలంలోని కేజీ సత్రంలో క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, తోటల్లో రైతులు ఒకేసారి మామిడి కాయలు కోయకుండా దఫదఫాలుగా కోస్తే ఆశించిన ధర పొందే అవకాశం ఉందన్నారు. మామిడిని పండు ఈగ ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పండుఈగ నివారణకు రాయితీపై బుట్టలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ సహాయకులు ఎగువమూర్తి, రైతులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సరిహద్దులో సీసీ కెమెరాల ఏర్పాటు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

యాదమరి: మండల పరిధిలోని అంతర్రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో అక్రమ రవాణా నివారణ నిమిత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని స్థానిక ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపారు. ఆయన గురువారం సరిహద్దు గ్రామాల ప్రజలతో మాట్లాడారు. కనికాపురం, కొట్టాలం మార్గాల నుంచి తమిళనాడుకు అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దీన్ని కట్టడి చేయడానికి అత్యాధునిక సాంకేతిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రజలకు 'మహా'నాడు దెబ్బ!

- కడపకు ఆర్టీసీ బస్సుల తరలింపుతో ప్రయాణికులకు తప్పని అగచాట్లు



వారపు సంత వద్ద బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఐరాల: కడప జిల్లాలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడుకు ఆర్టీసీ బస్సులు తరలివెళ్లడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గంగజాతర సందర్భంగా బెంగళూరు, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో ప్రజలు చుట్టు పక్కల గ్రామాల బంధువుల ఇళ్లకు వచ్చారు. గురువారం తిరిగి వెళ్లడానికి బస్టాండుకు వెళ్లిన ప్రయాణికులకు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో నరకయాతన అనుభవించారు. గంటల తరబడి వందలాది మంది ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండాల్సి వచ్చింది. రెండు గంటలైనా ఒక్క బస్సు కూడా రాలేదని వాపోయారు. కొందరు అధిక చార్జీలు వెచ్చించి ప్రైవేట్ వాహనాల్లో గమ్యస్థానాలకు వెళ్లారు.

తొలి ఏడాది.. అన్నీ మోసాలే!



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో వరుసగా షాక్‌లు ఇస్తోంది. రేషన్ సరుకులను భారీగా కుదించి పేదల పొట్ట కొడుతూ వస్తోంది. తాజాగా దివ్యాంగులు, వృద్ధులు, అనారోగ్య పీడితులతో పాటు కార్డుదారులకు సౌలభ్యంగా ఉన్న ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని రద్దు చేసింది. జూన్ ఒకటో తేదీ నుంచి చౌక దుకాణాల వద్దే రేషన్ సరుకులు పంపిణీకి సిద్ధమవడంతో జనం నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి.

- ఇంటింటికీ రేషన్ విధానం రద్దు
- జూన్ 1 నుంచి చౌక డిపోల వద్దే రేషన్ పంపిణీ
- ఉపాధి కోల్పోయిన ఎండీయూ ఆపరేటర్లు
- పల్లెప్రజలకు తప్పని కష్టాలు

పాలసముద్రం: ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు అరికట్టేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ విధానానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ఇంటింటికీ రేషన్ అందించే ఎండీయూ వాహనాల నిర్వహణ ఖర్చుతో కూడుకున్నదని సాకు చూపి ఈ నిర్ణయం తీసుకుంది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 254 ప్రభుత్వ చౌకధాన్యపు దుకాణాల పరిధిలో వివిధ కేటగిరీల 78,337 రైస్ కార్డులు ఉన్నారు. వీటి ద్వారా 2,33,852 మంది లబ్ధి పొందేవారు. 2021 నుంచి 48 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించారు. దూరాభారంతో పాటు వ్యయప్రయాసలు తగ్గడంతో కార్డుదారులు సంతోషంగా సరుకులు తీసుకునేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇంటి వద్దనే రేషన్ పొందే అవకాశాన్ని కార్డుదారులు కోల్పోయారు. ఇక నుంచి చౌకదుకాణాలకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి ఉంటుంది.

రోడ్డున పడుతున్న ఎండీయూ ఆపరేటర్లు

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఇంటివద్దకే రేషన్ సరుకులు తీసుకొచ్చే ఎండీయూ వాహనదారులు 48 మంది ఉన్నారు. ప్రతి వాహనానికీ ఒక ఆపరేటర్, ఒక హెల్పర్ ఉన్నారు. ఈ లెక్క ప్రకారం 48 మంది ఆపరేటర్లు, 48 మంది హెల్పర్లు ఉపాధి పొందుతున్నారు. వాహనం నిర్వహణకు ప్రతి నెల ప్రభుత్వం రూ.21 వేలు చెల్లించేది. ఇందులో రూ.3 వేలు వాహనం కంతు రూ.3 వేలు పెట్రోల్, రూ.5 వేలు హెల్పర్‌కు ఇస్తారు. మిగిలిన రూ.10 వేలు ఆపరేటర్ వేతనంగా తీసుకునేవారు. ఈ క్రమంలో ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో ఆపరేటర్లు, హెల్పర్లు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. ఇంటింటికీ ఉద్యోగం కల్పిస్తామన్న కూటమి నాయకులు హామీని నెరవేర్చకుండా తమ ఉద్యోగాలు ఊడగొట్టి రోడ్డున పడేసిందని ఆపరేటర్లు, హెల్పర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలం	రేషన్ కార్డులు	లబ్ధిదారులు	చౌకదుకాణాలు	ఎండీయూ సంఖ్య
గంగాధరనెల్లూరు	19949	61587	66	11
శ్రీరంగరాజుపురం	11480	34614	44	7
కార్వేటినగరం	13408	39140	44	9
వెదురుకుప్పం	14456	42375	41	9
పెనుమూరు	12557	36462	35	8
పాలసముద్రం	6487	19674	24	4

కంతులు ఎలా చెల్లించాలి?



ఎండీయూ వాహనాల్ని రద్దు చేయడంతో ఆపరేటర్లు చిక్కుల్లో పడినట్లయింది. వాహనాలకు సంబంధించి నెలవారీ కంతులు బ్యాంకులకు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వ నిర్ణయంతో ఆపరేటర్లే కాదు. కార్డుదారులకూ ఇబ్బందులు తప్పవు. అందరినీ దృష్టిలో ఉంచుకుని ఎండీయూ వ్యవస్థపై ప్రభుత్వం పునరాలోచించాలి. తగిన నిర్ణయం తీసుకోవాలి.

–కృష్ణయ్య, ఎండీయూ, ఆపరేటర్, పాలసముద్రం

ఇంటి దగ్గరే రేషన్ ఇవ్వాలి



ఇంటి వద్దకే రేషన్ సరుకులు ఇవ్వడం వల్ల మాలాంటి వారికి ఎంతో సౌలభ్యంగా ఉండేది. బియ్యం బండి ఎప్పుడు వస్తుందో సమాచారం ఇచ్చేవారు. ఇప్పుడు పనులన్నీ వదులుకొని రేషన్‌షాపుల వద్దకు పరుగు తీయాల్సి వస్తుంది. పైగా వెళ్లిన రోజే రేషన్ అందుతుందనే నమ్మకం లేదు. ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించే పద్ధతినే కొనసాగించాలి.

– బీయాల్లా, తిరుమలరాజుపురం, గృహిణి

పనులకు పోలేం



గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి వారి కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఇంటివద్దకే రేషన్ ఇచ్చేవారు. మాకు ఇబ్బంది ఉండేది కాదు. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయక పోవడమే కాకుండా ప్రజలకు ఎంతో ఉపయోగపడే బియ్యం బండ్లను తొలగించడం అన్యాయం.

–సెల్వీ, చెరుముందర కండ్రిగ, గృహిణి, పాలసముద్రం

తిప్పలు తప్పవు



కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ పంపిణీ రద్దు చేయడం దుర్మార్గం. ప్రజలు ఎండీయూ వాహనాల ద్వారా ఎంతో సౌకర్యవంతంగా రేషన్ పొందేవారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో తిరిగి స్టోర్ డీలర్ల వద్దకు వెళ్లి రేషన్ తీసుకోవాలీఅంటే మాకు తిప్పలు తప్పవు.

–షణ్ముగరెడ్డి, కృష్ణమ్మపురం, పాలసముద్రం

కరోనాలోనూ సేవలు అందిస్తే..



కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు సరఫరా చేశాం. ప్రభుత్వం అప్పగించే అన్ని బాధ్యతలు నెరవేరుస్తూ వచ్చాం. అకస్మాత్తుగా ఈ ప్రభుత్వం రేషన్ పంపిణీ వాహనాలను ఆపేస్తోంది. దీంతో మా బతుకు బండి చక్రాలు కూడా ఆగిపోయినట్లే.

–రాజేంద్రుడు, ఎండీయూ ఆపరేటర్, కాకవేడు

మా కడుపు కొట్టడం దుర్మార్గం



ఎండీయూ వాహనాన్ని నడుపుకుంటూ రూ.10 వేలు సంపాదిస్తూ జీవనోపాధి పొందేవాణ్ణి. ఈ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో పని కోల్పోయాం. ఉద్యోగావకాశాలు కల్పించడం పోయి ఎండీయూ వాహనాలతో ఉపాధి పొందుతున్న మాపొట్ట కొట్టేలా నిర్ణయం తీసుకోవడం దుర్మార్గం. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

–రవి, ఎండీయూ ఆపరేటర్, పాలసముద్రం

ఆయాలకు పెండింగ్ జీతాలు ఇవ్వండి సారూ!

- కలెక్టర్‌కు ఏఐటీయూసీ నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు, ఆయాలు

నగరి: ఆయాలకు పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలంటూ ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి కోదండయ్య జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. గురువారం ఆయాలతో పాటు కలెక్టర్‌ను కలిసిన వారు పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని, వేసవి సెలవులకు పూర్తిస్థాయి జీతాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆశ, హసీనా, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చందామర్రై, ఆయమ్మల నాయకురాళ్లు జయకుమారి, కోకిల పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సేవలు అందించండి



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రమౌళి

కార్వేటినగరం: ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే రేషన్‌కార్డు, ఆధార్ కార్డుల నమోదును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరితో స్నేహభావంతో వ్యవహరించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్య పరిష్కార మార్గమే ధ్యేయంగా సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. వారి వెంట ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నాగరత్నమ్మ, సచివాలయ సిబ్బంది పలువురు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న అధికారులు, సచివాలయ సిబ్బంది



యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న కృష్ణమహేష్‌రెడ్డి

నగరి: నిరంతర యోగాసనాలు వేస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి కమిషనర్ మాట్లాడారు. యోగా చేస్తే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు మటుమాయం అవుతాయని, ప్రశాంత జీవితానికి యోగా ఒక సాధనమన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు కవిత, నాగామృతం అధికారులకు, సచివాలయ సిబ్బందికి, మున్సిపల్ సిబ్బంది చేత పలు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో డీఈఈ రవీంద్రారెడ్డి, ఏఈలు నవీన్, హేమశేఖర్, పీడీ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేజీ పురుషోత్తం, రెవెన్యూ అధికారి తారకరామ్, సీఎంఎం ప్రసాద్ పాల్గొన్నారు.

పాలసముద్రం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రెండవ రోజు సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో కలసి యోగాసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వాదేశాల మేరకు మే 21వ తేదీ నుంచి జూన్ 21 వరకు యోగాపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం యోగా చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పీహెచ్‌సీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'సింధూర్' విజయోత్సవ ర్యాలీ



గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు

చిత్తూరు కార్పొరేషన్: పెహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్‌పై భారత్ త్రివిధ దళాలు ×ఆపరేషన్ సిందూర్× పేరిట దాడులు చేసి ఉగ్రవాద శిబిరాలు, వైమానిక స్థావరాలను నేలమట్టం చేయడంపై భారత్ ప్రజానీకం సంబరాల్లో మునిగి తేలుతోంది. ఈ విజయం పురస్కరించుకుని సైనికులకు మద్దతుగా గురువారం సాయంత్రం చిత్తూరులో మహిళలు జాతీయ పతాకాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ మహిళా సమన్వయ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద నుంచి నినాదాలు చేసుకుంటూ నగరవీధుల్లో తిరిగారు. పాకిస్థాన్‌పై మనదేశం స్పందించిన తీరుకు యావత్తు ప్రపంచమే విస్తుపోయిందని, మన సైనిక సత్తా ఏమిటో ప్రపంచ దేశాలకు చాటిచెప్పగలిగామన్నారు. కార్యక్రమంలో నాయకులు అనురాధ, లక్ష్మీప్రసన్న, సుకన్య, సుందరి, లీల, దీప, హేమలత, నాయకులు చిట్టిబాబు, రామభద్ర తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మంచి దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేతలు

విజయపురం: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే మంచి దిగుబడి పొందడంతోపాటు పంటల సాగుకు ఖర్చు తగ్గుతుందని రాస్ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డి.అనూష అన్నారు. గురువారం రాస్ కృషి విజ్ఞా కేంద్రం ఆధ్వర్యంలో ఏవో రజనికుమారి అధ్యక్షతన కలియంబాకం, స్వామిరెడ్డికండ్రిగ, ఆలపాకంలో 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్ యాత్ర' కార్యక్రమం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. ఒక డ్రోన్ సుమారు 17 నిమిషాల్లో ఎకరా పంటకు మందు పిచికారీ చేస్తుందని, దీని వల్ల కూలి ఖర్చు గణనీయంగా తగ్గుతుందన్నారు. వ్యవసాయంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, విత్తన రకాలు, వర్మీ కంపోస్ట్ వినియోగ ప్రాధాన్యతను ఏడీఏ నాగపద్మ వివరించారు. సేంద్రియ, కషాయాల తయారీ విధానాలు, వినియోగంపై ఏఓ రజని అవగాహన కల్పించారు.

పశుపోషణే పెద్ద దిక్కు

- జబ్బవాపు వ్యాధితో అప్రమత్తత అవసరం
- నివారణ టీకాలు వేయించాలి



ముడిపల్లిలో గడ్డి మేస్తున్న పశువులు

నగరి: రైతుకు వ్యవసాయం, పశు పోషన రెండు కళ్లలాంటివి. వ్యవసాయం చేస్తూ పాడి పశువులను పోషించుకోవడం ద్వారా రైతు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాయి. ఎంతో పెట్టుబడి పెట్టి రేయింబవళ్లు శ్రమించి చేసిన వ్యవసాయం ఒక్కొక్కసారి నష్టాల్లో ముంచేయవచ్చు. కానీ పాడి మాత్రం రైతును పెద్ద దిక్కులా ఆదుకుంటుందనే చెప్పాలి. ఎక్కువ శాతం రైతులు వ్యవసాయంతోపాటు పాడి పశువుల పోషణ చేపడుతున్నారు. దీంతో పశుపోషణలో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పశు పోషణ విధానం, వ్యాధులు, నివారణపై ప్రతీ పాడి రైతు అవగాహన కలిగి ఉండాలి. సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండడమే కాకుండా ముందస్తుగా వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. పశువుల్లో సీజనల్‌గా అనేక వ్యాధులు వస్తుంటాయి. అందులో ప్రధానంగా జబ్బవాపు వ్యాధి ప్రమాదకరమనే చెప్పాలి. ముందుగా నివారణ చర్యలు తీసుకుంటే నష్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది. వ్యాధి లక్షణాలు కనిపించగానే పశువైద్యుడిని సంప్రదించి తగు చికిత్స చేయించాలి.

వ్యాధి లక్షణాలు

ఈ వ్యాధి 6 నెలల నుంచి 2 ఏళ్ల వయసున్న పశువులకు సంక్రమిస్తుంది. వ్యాధి సోకితే పశువు తొడ కండరాలు, జబ్బపై వాపు కనిపిస్తుంది. వాపు ఉన్న చోట వేడిగా ఉండి పశువు నొప్పితో విలవిల్లాడుతుంది. ముందు కాళ్ల మధ్య కూడా వాపు వచ్చే అవకాశం ఉంటుంది. వాపు ఉన్నచోట తాకితే కరకరమన్న శబ్దం వస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువుల్లో ఆకలి మందగించి నీరసించిపోతాయి. సకాలంలో గుర్తించకపోతే జ్వర తీవ్రత 104 నుండి 106 డిగ్రీలకు పెరిగి పశువు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన చిన్న పశువులు అకస్మాత్తుగా మరణిస్తాయి. ఎక్కువ శాతం రైతులు ఈ వ్యాధిని గమనించక ముందే పశువులు చనిపోతాయి. ఒకటి కంటే ఎక్కువ శరీర భాగాల్లో వాపు కనిపిస్తే పశువు 12 నుంచి 36 గంటల్లోగా చనిపోతుంది. సాధ్యమైనంత వరకు రైతులు నిత్యం పశువులను గమనిస్తూ ఉండాలి. సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన పశువులను గుర్తించిన వెంటనే మిగతా పశువులకు దూరంగా ఉంచి చికిత్స చేయించాలి.

జబ్బవాపు వ్యాధి

ఈ వ్యాధి తొలకరి చినుకులు పడగానే తన ఉనికిని చాటుకుంటుంది. సాధారణంగా ఆరోగ్యంగా, బలంగా ఉన్న పశువులకు వ్యాధి సోకుతుంది. ఉష్ణ ప్రాంతాలు, గాల్లో తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తొందరగా వ్యాప్తి చెందుతుంది. ఒక రకమైన సూక్ష్మజీవి ద్వారా ఈ వ్యాధి సంక్రమించి, నష్టాన్ని కలగజేస్తుంది. అంతేకాకుండా కలుషితమైన నీరు, ఆహారం ద్వారా కూడా త్వరగా వ్యాపిస్తుంది.

వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



ఈ ప్రాంతాల్లో జబ్బవాపు వ్యాధి సోకే అవకాశం లేకపోయినా నిర్లక్ష్యంగా ఉండకూడదు. తొలకరి వర్షాల సమయంలో ఈ వ్యాధి సోకే అవకాశం ఉన్నందున ముందుగానే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపించగానే పశువైద్యుడిని సంప్రదించాలి. వ్యాధి సోకిన పశువుకు పెన్సిలిన్, ఇతర యాంటీ బయాటిక్ మందులు వేయాలి. వ్యాధి సోకిన పశువులను మిగతా పశువుల నుంచి వేరు చేయాలి. వ్యాధి వచ్చిన పశువు మలమూత్రాల తోపాటు గడ్డిని కూడా కాల్చి వేయాలి.

–డాక్టర్ వాసు, అసిస్టెంట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, నగరి

మహాభారత ఉత్సవాలు ప్రారంభం

యాదమరి: మండల పరిధిలోని చెన్నారెడ్డిపల్లిలో శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజుల వారి దేవస్థానంలో 43వ మహాభారత ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు వేడుకగా ధ్వజారోహణం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ప్రాంగణంలో హరికథా కాలక్షేపం సాగింది. ఉత్సవాలను జూన్ 15 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మండలి తెలిపింది.

నోటీసు

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా నగరి మండలం, ముడిపల్లి గ్రామము నందు శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్యస్వామి దేవాలయము కలదు. సదరు దేవాలయము దేవదాయశాఖ నందు Section 43 ప్రకారము రిజిష్టరు చేయదలచినాము. ఇందుకు ఏదైనా అభ్యంతరాలు ఉన్నయెడల సహాయ కమిషనర్, దేవాదాయశాఖ చిత్తూరు వారి కార్యాలము నందు 15 రోజులు లోపల తెలియజేయగలరు.

- ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు. ముడిపల్లి, నగరి మండలం, చిత్తూరు జిల్లా.